అహింసా సిద్ధాంత వాదులను ఎగతాళి చేయగలమా?' అంటూనే ఉన్నాడు నీలకంఠం.

'జాగ్రత్తగా మాట్లాడు' కూర్మారావు కోపంగా అన్నాడు.

'తమరు శాంతమూర్తులని తెలిసి కూడా నీలకంఠం తొందరపడుతున్నాడు. ఏదో కుర్రతనంక పోనీయండి,' అంటూ లేనిపోని శాంతాన్ని కొని తెచ్చుకుంటున్నాడు మార్క్సిస్టు.

'నువ్వుకూడా కొంచెం పళ్లు దగ్గర పెట్టుకు మాట్లాడాలి.' అన్నాడు కూర్మారావు.

'ఆ! చూడండి' నా శరీరం నా వద్దనే ఉన్నది' అంటూ మార్క్సిస్టు కూర్మారావు దగ్గరకు వచ్చాడు.

'ఏం? కొడతావా? మీదిమీదికేవస్తున్నావ్!' అంటూ కూర్మారావుకూడ లేచి నిలబడ్డాడు.

గాంధీ అంతటి మహాత్ముడు ఒక చెంప కొడితే మరొక చెంప చూపించమన్నాడు. కూర్మారావు రెండు చెంపలూ చూపించాడు, ఒక చెంపమీద కూడా చెయ్యిపడకముందే.

'ఆహా! హా!' అన్నాడు అక్కడ పోగయిన పెద్దమనుషులు.

కాని మరునాటినుండీ మార్క్సిస్టూ, నీలకంఠం కూడా కనుపించలేదు. నీలకంఠం మాత్రం సెంట్రల్ జెయిల్‌లో ఉన్నాడని అన్నారు. కాని మార్క్సిస్టు ఏలోకంలో ఉన్నాడో?

# సేట్‌జీ దూరదృష్టి

యం. హీరాలాల్ రాయ్

దేవదాస్‌గుప్త హైదరాబాద్ వచ్చాడని విన్నాను. పోలీసు చర్య తర్వాత చాలా మంది పెద్దలు వస్తున్నారు. గుప్తకూడా వచ్చి వుంటాడు. లక్నోలో దేవదాస్‌గుప్త బిల్డింగ్స్ చూస్తూ, ప్రతి రోజూ సాయంత్రం షికారు వెళుతుండేవాణ్ణి. పెద్దబజార్లలో ప్రతిచోటా దేవదాస్‌గుప్తా బిల్డింగ్స్ కనిపిస్తుంటాయి. నేను వాళ్ళ యింటికి వెళ్ళాలనే ప్రత్యేకమైన కోరిక లేకపోయినా, వాళ్ళ బంధువులకి మాతో కొంత బాంధవ్యం వుండటంవల్ల, ఒకనాడు వాళ్ళతో కలిసి వెళ్ళాను. లక్నోలో పెద్ద ధనికుల్లో ఒకడు గుప్త. ఆయన నివాస గృహం చాలా అందంగానూ, అన్నివిధాలైన సౌకర్యాలతోనూ నిండివుంది. బంగళాలో వెనక భాగంలో ఒక చిన్న కచేరీ హాలు. ఆ హాలుకి వెనకగా కొందరు భోగంవాళ్లు, నాట్యకత్తెలు, వీణ వాయించేవాళ్లు వుంటారు. ఉత్తరంవైపు ఆయన ముగ్గురు భార్యలూ ప్రత్యేకమైన భాగాల్లో వుంటారు. దక్షిణాన భార్యలకు ఎదురుగా తన భాగం. ముందరవైపు గుమస్తాలు మొదలైనవాళ్లూ, ఖాతా పుస్తకాలు, లెక్కలూ, టెలిఫోనులూ గొడవా వుంటుంది. బంగళా మూడో అంతస్సుకు వచ్చిన బంధువులూ మిత్రులూ వుండటంగానీ, లేక మాట్లాడి వెళ్ళిపోవడంగానీ జరుగుతుంది. మొత్తంమీద చాలా విశాలమైన భవనం. చక్కని భోజనాలు, మంచి పరుపులు, పానీయాలు. బంగళా మూడో అంతస్సుకు పాకే పూల తీగలు. ప్రత్యేకంగా ఎర్రని పూలు పూచే తీగలు.

దేవదాస్‌గుప్తా హైద్రాబాద్ వచ్చాడంటే, ఆనాటి పరిచయం జ్ఞాపకం వచ్చింది. కాని, గుప్తా హైదరాబాద్‌లోనే నివాసం ఏర్పరచుకున్నాడని సవివరంగా తెలియగానే కొంత ఆశ్చర్యపడ్డాను. లక్నో వదిలేసి హైదరాబాద్ దేనికి వొచ్చాడా అని. దేవదాస్‌గుప్తా హైదరాబాద్‌లో పెద్దపెద్ద సౌధాలు కొనేస్తున్నాడనీ, పార్కులు వేస్తున్నాడనీ, ఒక సత్రం కట్టించడానికి పర్మిషన్ సంపాదించుకున్నాడనీ విన్నాను. తరువాత కొన్నాళ్ళకి ఆయన ఇంటినుంచి వచ్చిన బంధువులు చెప్పారు: లక్నోలో బంగళాలు గుప్తా అమ్మేస్తున్నాడనీ, ఆయన భార్యలుకూడా హైదరాబాద్ వచ్చా

రనీ విన్నాను. నాకు ఇదంతా ఎందుకు జరుగుతోందో తెలియలేదు. మళ్ళీ ఒకమాటు గుప్తాను కలుసుకుని తెలుసుకుంటే బావుండుననీ ఎందుకో లేనిపోని కోరిక కలిగింది.

గుప్తా నన్ను చూసి రెండు నిముషాలు ఆగి నన్ను గుర్తించాడు. 'మీరు ఫలానావారి నాలుగో కుమారులు కదూ?' అన్నాడు.

'అవును. మీకు అంత జ్ఞాపకం వున్నానా?'

'లేకేం? మీ నాన్న లక్నోనుంచి హైదరాబాద్ వచ్చిన రోజులూ, తరువాత తరుచు మీ వాళ్ళు లక్నోలో కలవడం; మీరూ వొచ్చేవారు కదూ అప్పుడప్పుడు.'

నేనూ తల వూపాను. గుప్తా మాకూ తనకూ ఎలా బంధుత్వమో, ఎవరికి ఎవరి పిల్లనిచ్చారో, ఎవర్ని ఎవరు చేసుకున్నారో అంతా చెప్పాడు.

'నాకు హైదరాబాద్‌లో అంతగా దగ్గర వాళ్ళు ఎవళ్లూ లేరు. మీరే కాస్త దగ్గిర బంధువులు. అయినా మీరుమాత్రం లక్నో వాళ్లు కాదూ! మీరు నన్ను ముమ్ముందు మరీ ఎక్కువగా కలుస్తుండాలి—ఐతే డాన్సుకు వెళదామా?' అన్నారు.

'ఎక్కడా డాన్సు?' అన్నాను. నాకు ఆ నాడు ఎక్కడా డాన్సు కార్యక్రమాలు వున్నట్టు తెలీదు.

'మనింట్లోనే' అంటూ నన్ను బుజంపూని లేవదీశారు చైర్‌లోంచి. నేనూ ఆయనా కింది అంతస్తుకి వచ్చి వెనకవైపు వెళ్ళాం. అంతా కొత్తవాళ్ళు. ఒక మూడువందలమంది వున్నారు. హైదరాబాదువాళ్లు కారు.

'వీళ్లంతా యెవరూ?' అని అడిగాను.

'మన ఇంట్లోని బంధువులూ, ఉద్యోగులూ అంతా లక్నోమయం.'

'నాకు లక్నోలో వున్నట్టే వుంది' అన్నాను తమాషాగా.

'అవును, అవును' అని నవ్వుతూ ఒక కిళ్లీ అందించారు. కిళ్లీ నోట్లో వేసుకుని నములుతున్నాను. పక్కదర్వాజాలోంచి మొగవేషంలో ఆడది వచ్చి, గల్లు గల్లుమని నృత్యం మొదలుపెట్టింది. కిళ్లీలో జరదావుంది. చూడలేదు నేను. జరదా గాటు కొట్టింది. చచ్చానురా అనుకున్నాను. ఉమ్మివేయడం బాగోదేమో అనుకున్నాను. చూస్తున్నాను. నృత్యం సాగుతున్నది. మరొక నాట్యకత్తె ఆడవేషంలో వొచ్చి మగవేషంలో వున్నావిడని కావలించుకుంది.

'హాయ్, హాయ్' అన్నారు గుప్తా కుడిచేయి విదిలిస్తూ.

నాట్యం అయిపోగానే మళ్లీ మూడో అంతస్తుకు వెళ్లాం. సాయంత్రం అవుతున్నది. ఎర్రని పూలు విచ్చివున్న తీగెలమీదినుంచి సూర్యుడు ఎర్రగా ప్రసరిస్తున్నాడు. మెరుస్తున్న పచ్చరంగు అద్దాల నీడలు సోఫాలమీద పడుతున్నాయి.

'రాయ్‌జీ! మీరేదో నన్ను అడగాలనుకుంటున్నట్టున్నారే' అన్నారు గుప్తా

'మరేంలేదు. మీరు నాకు ఆప్తులు. మీరు లక్నోనుంచి ఇక్కడికి వచ్చారు. సంతోషం. అయితే ఈ మార్పుకు కారణం? మీరు మరేం అనుకోకుంటే తమమనోభావం తెలిస్తే నేనుకూడా నా సలహా ఇవ్వదల్చుకున్నాను' అన్నా.

'నేను ఇప్పటికి ఇంకా హైదరాబాద్ వ్యాపారస్తులలో కలవలేదు. ఏదో అధికార్లతో మాత్రం కలిశాను. ఢిల్లీనుంచి తెచ్చిన వుత్తరాలు వప్పచెప్పాను. సంస్థాన అధికార్లంతా అక్కడివాళ్ళేగా. అయితే - నేను ఇక్కడికి తాత్కాలికంగా మారడానికి, ముందుముందు స్థిరనివాసంకూడా ఏర్పడడానికీ కారణాలు వున్నాయి' అంటూ లేచి బెల్లునొక్కారు గుప్తా.

గుప్తా చాలా తెలివైనవాడు, ఆయనకు రాజకీయ పరిణామాల్ని గురించీ, ప్రభుత్వంలో వచ్చే మార్పుల్నిగూర్చి బాగా తెలుసు. రాచకీయాలు బాగా తెలిసిన వ్యాపారి గుప్తా.

బెల్లువిని బాదంకీర్ గ్లాసులు పట్టుకొచ్చిన నౌకర్ని అదిలించి వెళ్ళగొట్టి గ్లాసు పెదవి దగ్గరగా పెట్టి:

'రాయ్‌జీ! మీకు నేనెంత ఆప్తుణ్ణో నాకూ మీరు అంతఆప్తులు. చూశారూ! స్వాతంత్రం అంటూ వచ్చి, కమ్యూనిస్టు ప్రమాదం తెచ్చిపెట్టింది. అటు చైనా పోయింది. టిబెట్‌గుండా హిమ పర్వతాలుదూరి చొరబడేట్టున్నారు. మన లోమాట: ఈ ప్రమాదం తగ్గేట్టు కనబడదు. ఢిల్లీ, లక్నోలకు అటు పాకిస్తాన్‌తోనో, ఇటు ఈ కమ్యూనిష్టులతోనో ప్రమాదంవుంటుంది. ప్రభుత్వం

కూడా సైనిక కేంద్రంగా సికిందరాబాద్ ప్రాంతాన్ని చేయాలనుకుంటోందిట. భారత గర్భంలో వుంది ఈ ప్రదేశం. చుట్టూ మన వాళ్లు. పాకిస్తాన్ చైనా మనకు చాలా దూరం. మనలో మాట — నాకు తురకలన్నా, కమ్యూనిస్టులన్నా చచ్చే భయం. అందులో మీ మూడో పిన్ని మరీ భయస్తురాలు. ఇంట్లో అద్దం గ్లాసు పగిలితే, అవి ఊడ్చి ఎత్తి పారేసేలోపల కాళ్ళనిండా గుచ్చుకొని నెత్తురు కారినంత భయపడుతుంది. అందుకోసం లక్నోనుంచి మారుస్తున్నాను మకాం.' అన్నారు గుప్తా.

'అదా! మీకు నా సలహా వినయపూర్వకంగా ఏమిటంటే ...' అని పడమరలోకి చూశాను. సూర్యుడు ఎర్రగా కోప్పడుతూన్నాడు. ఎర్రపూల తీగెలు జడిపిస్తూన్నై.

'మీరు ఈ తీగెలు లక్నోలో కాక హైదరాబాద్‌లో కూడా వుంచారేం? ఈ ఎర్రపూల తీగెలు ప్రమాదం. ఈ ఎరుపులో కమ్యూనిస్టులుంటారు. తెంపివేయించండి. ఎరుపు ప్రమాదం' అన్నాను.

'అలాగా! ఇప్పుడే తెంపివేయిస్తాను.' బెల్ నొక్కారు. మనుషులు రాగా వాళ్ళకి తీగెలన్నీ నరికివేయమని ఆదేశించారు.

'ఎందుకూ, ప్రస్తుతం పూలు తెంపించండి. అయితే కాకాజీ! మీరు లక్నోలో ప్రమాదం రానుందని గ్రహించడం తమ తెలివితేటలకు నిదర్శనం. తాము చాలా దూరదృష్టి ఉపయోగించారు. కాని హైదరాబాద్ పరిస్థితి చూడలేదు. లక్నోకు కమ్యూనిస్టులు ఎక్కడినుంచో రావాలి. కాని హైదరాబాద్‌లో బోలెడుమంది కమ్యూనిస్టులు. ఓడిపోయిన రజాకార్లు వాళ్ళకి వత్తాసు ఇస్తున్నారు. కమ్యూనిస్టులు పల్లెల్లో నరుకుతున్నారు. హైదరాబాద్‌కు పది మైళ్ళలో నలుగుర్ని నరికారు. నగరంలో ఎవర్నీ నమ్మలేం. వేల సైన్యాలు మనవి పనిచేస్తున్నవి. అయినా సంతృప్తికరమైన ఫలితాల్లేవు. ఇంతకంటే లక్నో నయం' అన్నాను.

'అమ్మో! అమ్మో! నన్ను నీవు ఈ రాత్రి లక్నో చేర్పించాలి. నేను ఇక్కడ వుండను. పది బిల్డింగులు కొన్నాను. అవి నువ్వే అమ్మించు' అని గబగబా లేచి బెల్లు నొక్కారు గుప్తా.

'ఈ రాత్రి ఎలా వెళ్ళడం? ఉదయం ప్లేన్‌లో వెళదాం. అంత తొందర దేనికి?' అన్నాను.

'లేదు లేదు. ఏబండి అన్నా వుంటే ఉదయానికి నాగపూర్ చేరదాం లేదా బొంబాయి పోదాం' అన్నారు గుప్తా హడావిడిగా.

'అంత తొందరపడాల్సిందేమీ లేదు.'

'అమ్మో! లాభంలేదు. పదండి, పదండి.' అన్నారు గుప్తా.

## సందేహాలు

యజ్ఞం చేసిన, సోమయాజులుగారికి స్వర్గంలో రంభా పరిరంభం కలుగుతుందిట. మరి, సోమిదేవమ్మగారికి?

జీవనోపాధిగా దేహాన్ని అమ్ముకునే సానిపాప బ్రతుకు నీచమట. మరి, ఆర్థిక సమస్యా పరిష్కారానికి, పెళ్లిపేడతో దేహమూ ఆత్మా రెండూ అమ్మబడే సంసారికన్య బ్రతుకు?

ప్రపంచ సుఖాలురోసి అడవిలో ఆకలములు తింటూ, తపశ్శక్తితో లోక కల్యాణంచేసే సన్యాసులకైతే కైలాసప్రాప్తి. మరి, పట్టణాలు వదలకుండా పిండి వంటలతో భిక్షులందుతూ గృహస్థులచే సేవించబడే స్వాములవారికేమి ప్రాప్తిస్తుందో?—(వి. కె. మ.)